RNI NO: APBIL/2015/67544

# సువార్త

# SUVAARTHA

సమగ్ర రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక వార్తపత్రిక

సంపుటి : 11 సంచిక :34, సంపాదకులు: Ch.I ప్రశాంత్ కుమార్ జూన్ 29 నుంచి 5 వరకు 2026 పేజీలు:8, వెల:రూ. 5/.

## తానా సేవా కార్యక్రమం.. విద్యార్థులకు హోంవర్క్ డైరీల పంపిణీ

అనకాపల్లి జిల్లా:(సువార్త ప్రతినిధి): దేవరాపల్లి మండలం తెనుగుపూడి ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో ఫౌండేషన్, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు హోంవర్క్ డైరీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చి. శ్రీచరణి మేకా స్పాన్సర్ చేయగా, తానా ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ చౌదరి మేకా ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, హోంవర్క్ డైరీలు విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు రోజూ చేసే హోంవర్క్, పాఠశాల కార్యకలాపాలు, చదువులో సాధిస్తున్న పురోగతిని తల్లిదండ్రులు సులభంగా తెలుసుకునేందుకు ఇవి దోహదపడతాయని చెప్పారు.

## డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించేందుకు చేతులు కలపాలి: పవన్


(సువార్త ప్రతినిధి): డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించే దుకు అందరూ చేతులు కలపాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు నిచ్చారు. మాదక ద్రవ్యాలు అనేవి కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా, అవి నిశ్శబ్దంగా ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయన్నారు. ఈ అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా.. ఒక డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించేందుకు ఉద్దేశించిన అన్ని ప్రయత్నాలకు తన పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

## 'డ్రగ్స్ వద్దు బ్రో'.. యువతకు పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు



అమరావతి,(సువార్త ప్రతినిధి): అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా సందేశం ఇచ్చారు. డ్రగ్స్‌పై పోరాటం అంటే యువత భవిష్యత్తును కాపాడటమే అని అన్నారు. ఏపీలో డ్రగ్ ట్రాఫికింగ్‌పై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. డ్రగ్స్ అక్రమ రవాణాదారులను చట్టం ముందు నిలబెడతామని అన్నారు. డ్రగ్స్ మహమ్మారి బారినపడ్డ వారికి అన్ని విధాలా సహాయం అందించి సాధారణ జీవితంలోకి తీసుకువస్తామన్నారు. గౌరవప్రదమైన పునరావాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏపీలో డ్రగ్స్‌కు చోటు లేదని సీఎం స్పష్టం చేశారు. డ్రగ్ ట్రాఫికింగ్‌పై జీరో టాలరెన్స్ విధానంతో ప్రభుత్వం ముందుకు వెలుతోందన్నారు. ప్రతి కుటుంబానికి సురక్షిత భవిష్యత్తు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. చణతీబస్త్రయానప్త్రబదీతీశీ ప్రచారానికి ప్రజలంతా సహకరించాలని పిలుపునిస్తూ.. డ్రగ్స్ వద్దు బ్రో హాష్ ట్యాగ్‌కు తన పోస్ట్‌ను సీఎం చంద్రబాబు ట్యాగ్ చేశారు.

## మనసున్న మహారాజు అశోక్ గజపతిరాజు.. గోవా గవర్నర్‌కు మంత్రి లోకేశ్ బర్త్‌డే విషెస్



'ఎక్స్' వేదికగా అశోక్ గజపతిరాజును కొనియాడుతూ ప్రత్యేక పోస్ట్

ఆయన్ను విలువల శిఖరంగా, అజాత శత్రువుగా అభివర్ణించిన లోకేశ్

విద్యాలయాలకు, ఆధ్యాత్మిక సేవకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్న మంత్రి

ఆయురారోగ్యాలతో వందేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్ష

అమరావతి,(సువార్త ప్రతినిధి): గోవా గవర్నర్, సీనియర్ రాజకీయ నేత పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. అశోక్ గజపతిరాజును 'విలువల శిఖరం', 'మనసున్న మహారాజు' అంటూ లోకేశ్ కొనియాడారు. "ప్రజాస్వామ్యంలో నిలువెత్తు మానవత్వ రాజసం అశోక్ గజపతిరాజు గారు. విద్యాలయాలకు వేల ఎకరాలు దానమిచ్చిన వితరణశీలి, ఆధ్యాత్మిక సేవకు ఆస్తులు ధారపోసిన ధర్మకర్త, రాజకీయాలలో అందరి మన్ననలు అందుకున్న అజాతశత్రువు" అని లోకేశ్ తన పోస్టులో ప్రశంసించారు. ప్రజల మనిషిగా వారి హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. అశోక్ గజపతిరాజు గారు ఆయురారోగ్యాలతో, ఆనందంగా వందేళ్లు వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తన శుభాకాంక్షల సందేశంలో తెలిపారు.

## ఘనంగా రొట్టెల పండుగ.. ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ



నెల్లూరు, (సువార్త ప్రతినిధి): జిల్లాలోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రొట్టెల పండుగ ఏర్పాట్లను, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. స్వర్ణాల చెరువులో రొట్టెను వదిలి.. రొట్టెను పట్టుకున్నారు. ఆపై, దర్గాలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 412 సంవత్సరాల చరిత్ర ఉన్న బారాషహీద్ దర్గాలో ప్రతి ఏటా భక్తులు పెరుగుతున్నారని తెలిపారు. 2014కి ముందు 4 లక్షల మంది భక్తులు వచ్చేవారని.. సరైన వసతులు ఉండేవి కావన్నారు. ఇప్పుడు వసతులు పూర్తిగా పెంచి అభివృద్ధి చేశామని చెప్పారు. గత ప్రభుత్వం దర్గా అభివృద్ధిని పక్కన పెట్టిందని మంత్రి విమర్శించారు. టూరిజం హబ్‌గా నెల్లూరు బారాషహీద్ దర్గాని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎంతో నమ్మకంతో దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తున్నారన్నారు. స్వర్ణాల చెరువులో నీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. 6315 మంది మున్సిపల్ శాఖ సిబ్బంది, 1870 పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను సిద్ధం చేశామని... బోట్ షికారు కోసం 8 రకాల బోట్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలని, అందరూ బాగుండాలని రొట్టె పట్టుకున్నట్లు నారాయణ తెలిపారు.

ఏర్పాట్లు అద్భుతం: ఎంపీ మాగుంట

50 ఏళ్లుగా రొట్టెల పండుగ కార్యక్రమంలో పాల్గొంటున్నానని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈసారి చాలా అద్భుతంగా ఏర్పాట్లు చేశారని కొనియాడారు. 2014 తర్వాత చంద్రబాబు ఆదేశాలతో మంత్రి నారాయణ దర్గా అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. టూరిజం స్పాట్‌గా బారా షహీద్ దర్గాను తీర్చిదిద్దడం చాలా సంతోషంగా ఉందన్నారు. చెరువుని ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నట్లు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.

## నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు: మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి,(సువార్త ప్రతినిధి): ఎరువుల పంపిణీలో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. APAIMS 2.0తో ఎరువుల అక్రమ మళ్లింపులకు పూర్తిగా చెక్ పెడుతున్నామన్నారు. నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందిస్తున్నామని తెలిపారు. APAIMS 2.0 ద్వారా ఇప్పటివరకు 2.97 లక్షల మంది రైతులకు ఎరువులను పంపిణీ చేసినట్లు చెప్పారు. 48,588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874 మెట్రిక్ టన్నుల డీఏపీ పంపిణీ జరిగిందన్నారు. పంట, సాగు విస్తీర్ణం ఆధారంగా అవసరమైన మేరకే ఎరువుల సరఫరా చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎరువుల నిల్వలు, సరఫరాపై రియల్‌టైమ్ పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. కౌలు రైతులతో సహా అర్హులైన ప్రతి రైతుకు సమాన అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. ఎరువుల సమస్యలపై టోల్ ఫ్రీ 155251కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ప్రారంభంలో వచ్చిన సాంకేతిక సమస్యల్లో అధిక భాగం పరిష్కరించినట్లు వెల్లడించారు. సబ్సిడీ ఎరువుల అక్రమాలకు APAIMS 2.0తో పూర్తిగా అడ్డుకట్ట వేస్తున్నామన్నారు.రైతులను తప్పుదోవ పట్టించే దుష్ప్రచారాలను నమ్మొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. టమాటా ధరలు పూర్తిగా పడిపోయాయన్న ప్రచారం అవాస్తవమని తెలిపారు. అధికారిక మార్కెట్ గణాంకాల ప్రకారం టమాటా ధరలు స్థిరంగానే ఉన్నాయన్నారు. జైన్ మ్యాంగో పల్ప్ యూనిట్‌పై జరుగుతున్న ప్రచారం కూడా అసత్యమే అని అన్నారు. రైతులు అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.


## ఆసుపత్రిలో ముద్రగడను పరామర్శించిన బొత్స, తోట త్రిమూర్తులు



అమరావతి,(సువార్త ప్రతినిధి): మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల సత్వర పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. ఈ వార్త తెలియగానే పలువురు వైసీపీ సీనియర్ నేతలు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈరోజు ఆసుపత్రికి వెళ్లారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల నుంచి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముద్రగడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం పట్ల వైసీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## డ్రగ్స్ ఫ్రీ ఏపీగా మార్చేందుకు అంతా సహకరించండి: హోం మంత్రి అనిత

విజయవాడ,(సువార్త ప్రతినిధి): ఏపీని డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా మార్చేందుకు అందరూ సహకారం అందించాలని హోంమంత్రి వంగలపూడి అనిత కోరారు. ఈరోజు(శుక్రవారం) తుమ్మలపల్లి కళాక్షేత్రంలో డ్రగ్ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా 'నషా ముక్త్ భారత్ అభియాన్ – విక్షిత్ భారత్ కీ పెహచాన్' థీమ్‌తో నిర్వహించి వర్క్‌షాప్‌కు హోం మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ఏ తల్లిదండ్రులైనా ఒంట్లో బాగోలేని బిడ్డకు జీవితాంతం సేవ చేయడానికై సిద్ధపతారని చెప్పారు. కానీ.. గంజాయి మత్తులో పడి జైల్లో ఉన్న బిడ్డను విడుదల చేసేందుకు ఏ పేరెంట్స్ కూడా ముందుకు రారన్నారు. హోం మంత్రి అయిన కొత్తలో ఓ వ్యక్తి తనకు ఫోన్ చేసి చెప్పిన విషయం షాక్‌కు గురయ్యేలా చేసిందన్నారు. నాలుగో తరగతి చదువుతున్న పిల్లాడు గంజాయికి బానిసయ్యాడంటూ సదరు వ్యక్తి చెప్పిన విషయం విని భయాందోళనకు గురైనట్లు చెప్పారు.ఈగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని.. నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్స్ తిరుగుతున్నాయని హోం మంత్రి తెలిపారు. ఎక్కడో చెట్టు కింద కూర్చొని గంజాయి తీసుకున్నా కూడా డ్రోన్ పట్టేస్తుందన్నారు. అంత స్ట్రిక్ట్‌గా



సర్వైలెన్స్ పనిచేస్తున్నాయని చెప్పారు. విజయవాడ కమిషనరేట్‌లో ఏ మూలకు వెళ్లినా సీసీటీవీ కెమెరాలు పనిచేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని.. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని యువతకు సూచించారు. చిన్న చిన్న ఆనందాల గురించి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని.. తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చే పరిస్థితి తీసుకురావొద్దన్నారు. లీగల్ టీమ్ 'ఆపరేషన్ గరుడ' పేరుతో మెడికల్ షాప్‌లను కూడా తనిఖీ చేస్తోందని అనిత తెలిపారు. గంజాయి పట్టడంలో పోలీస్ డాగ్‌లు ఉత్తమ అవార్డులు కూడా తెచ్చాయని తెలిపారు. మత్తు పదార్థాల సమాచారం ఉంటే 1972కి కాల్ చేయాలని.. ఇన్ఫర్మేషన్ ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి అందరి సహాయ సహకారాలు ఇవ్వాలని హోం మంత్రి అనిత పిలుపునిచ్చారు.

## పల్నాడులో వరుస రోడ్డు ప్రమాదాలపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష


అమరావతి,(సువార్త ప్రతినిధి):: పల్నాడు జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలపై ఉన్నతాధికారులతో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. ఈరోజు(శుక్రవారం) కలెక్టర్, ఎస్పీలతో మంత్రి మాట్లాడారు. యాక్సిడెంట్ స్పాట్స్ గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తూ నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వాహనం పాడైనా, ఏదైనా కారణం చేత రోడ్డు మీద ఆగిపోతే వెనక వచ్చే వాహనాలకు ఆ విషయం తెలిసేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీకి దిశానిర్దేశం చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల నగరవనం వద్ద రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందటం పట్ల మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్య వివరాలు తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను గొట్టిపాటి రవికుమార్

# సంపాదకీయం

## ప్రతిఘటన పథంలో 'ఇండియా'

ప్రతిఘటన. జూన్ 8న 'ఇండియా కూటమి' (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్) అంతర్గత సమావేశంలో రాహుల్‌గాంధీ వెలువరించిన స్ఫూర్తిదాయక ప్రసంగం సారాంశాన్ని సంగ్రహపరిచిన పదమది. 'కాంగ్రెస్ పార్టీ ఒక ప్రతిఘటన ఉద్యమం' అని రాహుల్ ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యను ప్రస్తుత కాంగ్రెస్ కార్యకలాపాల వాస్తవికత గురించిన ప్రకటనగా కాకుండా గతించిన తరాల వారిని ఎంతగానో ఉత్తేజపరిచిన ఒక ఆదర్శాన్ని పునరుద్ధరించి ఔదలదాల్చే సంకల్పంగా భావించాలి. వర్తమాన భారత ప్రజాస్వామ్యాన్ని పీడిస్తున్న సమస్యల గురించి ఆయన చేసిన నిశిత విశ్లేషణ, వాటిని అధిగమించేందుకు సూచించిన పరిష్కార మార్గాలే రాహుల్ ప్రసంగ విశిష్టతలు. అవి మౌలికమైనవి, కనుక సార్థకమైనవి. జాతి రాజకీయ జీవితంలో నిర్ణయాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న తరుణమిది: పోటీతత్వ నిరంకుశత్వం (కాంపిటీటివ్ అథారిటేరియనిజం) నుంచి ఏకపక్ష ఆధిపత్యం (ఎలెక్టోరల్ ఆటోక్రసీ) భారత గణతంత్ర రాజ్య రాజకీయాలు పరివర్తన చెందుతున్న కీలక సందర్భంలో నేడు మనం ఉన్నాం. రాహుల్ ప్రసంగం దేశ రాజకీయాలలో రావాల్సిన ఒక వ్యూహాత్మక మార్పును కూడా స్పష్టంగా, తార్కికంగా ప్రకటించింది: ఎన్నికల పోటీ రాజకీయాల నుంచి ప్రతిఘటనాత్మక రాజకీయాలకు ప్రతిపక్షాలు పరివర్తన చెందాలి. ఈ ప్రకటనలోని ప్రధాన భావాలను చర్చించాలి, మెరుగుపరచాలి, సులభగ్రాహ్యం చేయాలి, ప్రజలలో వ్యాపింపజేయాలి. ఇది నేటి రాజకీయ కర్తవ్యాలలో ముఖ్యమైనది. భారత ప్రభుత్వ యంత్రాంగాలు అన్నిటినీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్వాధీనం చేసుకున్నదని రాహుల్ తన ప్రసంగంలో నిశితంగా విశ్లేషించారు. మీడియా, సోషల్ మీడియా, న్యాయ వ్యవస్థ, బ్యూరోక్రసీ దర్యాప్తు, గూఢచర్య సంస్థలు సమస్తమూ ప్రస్తుత ప్రభుత్వాన్ని ఎప్పటికీ అధికారంలో ఉంచేందుకు దీక్షాదక్షతలు చూపుతున్నాయని ఆయన గర్హించారు. ఈ పరిస్థితి మరింతగా అధ్వానమవుతోందని ఆయన స్పష్టంగా చెప్పారు. 'ఇంతవరకు తమ రాజ్యాంగ విధులను ఎలాగోలా సక్రమంగా నిర్వర్తిస్తున్న ప్రభుత్వ సంస్థలు సైతం సమీప భవిష్యత్తులోనే అలా పనిచేయడాన్ని నిలిపివేస్తాయి. కారణమేమిటి? భారత రాజ్య వ్యవస్థపై బీజేపీ, ఆరెస్సెస్‌లు తమ పట్టును ఎటువంటి మినహాయింపు లేకుండా సంపూర్ణంగా బిగిస్తాయని రాహుల్ అన్నారు. భారత ప్రజాస్వామ్యంలోని తిరోగమన పోకడలు, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థల పతన రీతులను ప్రతిబింబిస్తున్నాయని రాజనీతి శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ పతనం రాత్రికిరాత్రే సంభవించినది కాదని మనకు తెలుసు. ప్రజాస్వామ్యం అంటే 'సంస్థాగత అనిశ్చితి' అని పోలిష్--అమెరికన్ రాజనీతి శాస్త్రవేత్త ఆడమ్ ప్రెవోర్స్కి సుప్రసిద్ధంగా నిర్వచించారు. ప్రజాస్వామ్యం అంటే పార్టీలు ఎన్నికలలో ఓడిపోయే వ్యవస్థ అని, అధికారాన్ని కోల్పోయే అపాయాన్ని పాలకులు అంగీకరించే విధానమే ప్రజాస్వామ్యమని ఆయన విశదీకరించారు. అధికారాన్ని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకే పాలకులు రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతను తగ్గించి వాటిని తమకు అనుకూలంగా చేసుకుంటున్నారు. తత్ఫలితంగా ప్రజాస్వామ్యం తిరోగమిస్తోంది. ప్రజాస్వామ్య తిరోగమనంలో రెండు మధ్యంతర దశలు ఉన్నాయి. మొదటిది-- పోటీతత్వ నిరంకుశత్వం. ఈ నిరంకుశత్వ పాలనా విధానం బహుళ పార్టీల ఎన్నికలను నిర్వహిస్తుంది. అధికారంలో ఉన్న వారు పరిస్థితులను ఎలాగైనా సరే పూర్తిగా తమకు అనుకూలంగా మలుచుకుంటారు. అధికారానికి పార్టీల మధ్య పోటీ ఉంటుంది. అయితే అది ప్రాథమికంగా అసమమైనది, అన్యాయమైనది. ఈ దృష్ట్యా ఇది నిజమైన ప్రజాస్వామ్యం కాదు. ఇక రెండోది-- ఏకపక్ష ఆధిపత్యం. ఈ వ్యవస్థలో క్రమం తప్పకుండా బహుళ పార్టీ ఎన్నికలు జరుగుతుంటాయి. అయితే ఆ ఎన్నికలు నామమాత్రమైనవే. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన పౌర స్వేచ్ఛలు ఉండవు. పోటీ చేసే రాజకీయ పక్షాలకు సమాన అవకాశాలు ఉండవు. పాలకులు తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికి నిర్నిబంధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడతారు. నియంతృత్వ పాలనకు చట్టబద్ధత కల్పించేందుకు మాత్రమే ఈ ఎన్నికలు ఉపయోగపడతాయి. భారత్ ప్రస్తుతం ఈ రెండు దశల మధ్య ఉన్నది. 2019 సార్వత్రక ఎన్నికల అనంతరం మన దేశం ఒక నిరంకుశత్వ పాలనా రాజ్యంగా పరిణమించింది. ఏకపక్ష ఆధిపత్యంలోకి భారత్ పతనాన్ని 2024 సార్వత్రక ఎన్నికలలో ప్రజా తీర్పు నిలువరించింది. దేశ పాలకులు ఆనాటి నుంచీ ఏ ఎన్నికలలోనూ పరాజయం పాలవ్వకుండా ఉండేందుకు చేయని ప్రయత్నమేదీ లేదు. అందులో భాగంగా మీడియా ద్వారా సమాచారాన్ని నియంత్రిస్తున్నారు; ప్రభుత్వ అధికారాలను ఉపయోగించుకుని ఆర్థిక వనరులను అపారంగా సమకూర్చుకుంటున్నారు; ప్రభుత్వ సంస్థలు, రాజ్యాంగ వ్యవస్థలను పూర్తిగా తమ అదుపులోకి తీసుకున్నారు. ఇలా సమస్త సమాజంపై అసాధారణ గుత్తాధిపత్యం ద్వారా సంభావ్య రాజకీయ నష్టాలను సాధ్యమైనంత వరకు తగ్గించుకుంటున్నారు లేదా నివారించుకుంటున్నారు. వీటి ద్వారా తమకు ఏర్పడిన అనుకూలతలను మరింతగా పెంపొందించుకునేందుకై ఎన్నికల వ్యవస్థకు పునఃరూపకల్పన చేస్తున్నారు: నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియల ద్వారా దేశ రాజకీయ భౌగోళిక స్వరూపాన్ని మార్చివేసేందుకు పూనుకున్నారు; పంచాయత్ నుంచి పార్లమెంటు దాకా సమస్త ప్రజాప్రాతినిధ్య సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడమనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అనే నినాదంతో ఆ లక్ష్య పరిపూర్తికి ప్రజల ఆమోదాన్ని సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు; మరీ ముఖ్యంగా ఓటర్ జాబితాల సమగ్ర ప్రత్యేక సవరణ ద్వారా ఎన్నికల వ్యవస్థను ఎటువంటి మినహాయింపులేకుండా తమకు అనుగుణంగా మార్చుకునేందుకు ప్రస్తుత పాలకులు చురుగ్గా కృషి చేస్తున్నారు. ఈ ప్రక్రియలన్నీ పూర్తయినప్పుడు మన ప్రజాస్వామ్యం పూర్తిగా ఏకపక్ష ఆధిపత్యంగా రూపొందుతుంది. ఎన్నికల ద్వారా సాధారణ ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఒక రాజకీయ పక్షం నుంచి మరో రాజకీయ పక్షానికి అధికారం బదిలీ అయ్యేందుకు చాలా చాలా తక్కువ అవకాశం మాత్రమే ఉంటుంది. నిక్కచ్చిగా చెప్పాలంటే అది పూర్తిగా ఉపేక్షణీయ అవకాశం. మన ప్రజాస్వామ్యం నేతి బీర చందమవుతుంది. ప్రతిపక్షాలు ఎట్టకేలకు ఈ కఠోర, నైరాశ్యపూరిత సత్యాన్ని గ్రహించాయి. దాన్ని ఎదుర్కోవడానికి సమకట్టాయి.

# నిన్ను నీవు తగ్గించుకో!




(సువార్త ప్రతినిధి): ప్రభువు దృష్టికి మిమ్మును మీరు తగ్గించుకొనుడి. అప్పుడాయన మిమ్మును హెచ్చించును. యాకోబు 4:10;

ఈ మాటలు వ్రాస్తున్నది ఎవరంటే, యేసు ప్రభువు సహోదరుడు. అయితే ఆయన ఎంతగా తగ్గించుకున్నారంటే. యేసు ప్రభువు దాసుడను అని తనను తనను పరిచయం చేసుకున్నారు.

క్రీస్తు యొక్క తగ్గింపు: ఫిలిప్పీ 2:5–8 దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు , మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను; సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను.

దేవుడైన వాడే దాసునిగా మారడం అంటే? ఇక తగ్గింపుకు ఇంతకు మించిన మాదిరి ఎవరు?

అబ్రాహాము: "ధూళియు, బూడిదైయున్నైన నేను" (ఆది 18:27 ) యేసు క్రీస్తు శరీర ధారిగా ఈ లోకానికి రావడానికి ఏర్పరచుకున్న వ్యక్తి; దేవుని స్నేహితుడు ;

విశ్వాసులకు తండ్రి ; భూమిమీదనున్న సమస్త వంశములు ఆశీర్వదించబడుటకు కారకుడు

మోషే: "నేనెంతటి వాడను?" ( నిర్గమ 3:11Ñ 4:10)

ఐగుప్తీయుల సకల విద్యలను అభ్యసించినవాడు; ఇశ్రాయేలీయులను నడిపించిన నాయకుడు; భూమి మీదనున్నవారందరిలో మిక్కిలి సాత్వీకుడు ;ధర్మశాస్త్రమునకు ప్రతినిధి; చేతులు పైకెత్తడం ద్వారా యుద్ధములో విజయాన్ని పొందినవాడు.

అపొస్తలుడైన పౌలు: "పాపులలో ప్రధానుడను" ( అపో. కా. 20:19; 1తిమోతి 1:15 )

అసలు పేరు సౌలు; యూదా మత ప్రవిష్టుడైన గమలియేలు పాదాలచెంత ధర్మశాస్త్ర విద్య నభ్యసించి, క్రైస్తవ్యాన్ని సమూల నాశనం చెయ్యడానికి అధికారం పొంది, క్రీస్తు ప్రత్యక్షత ద్వారా క్రీస్తు ఖైదీగా మార్చబడి, క్రీస్తును పోలి నడచినవాడు. 2nd Founder of Christianity అని పిలువబడే వ్యక్తి; బైబిల్ గ్రంథములో అత్యధికముగా 14 పత్రికలు వ్రాసినవాడు. బైబిల్ గ్రంథములోనే సువార్త నిమిత్తమైన 'గొప్ప ప్రయాణికుడు'; అపోస్తలుడు; ప్రవక్త; దైవజనుడు; పెద్ద; సువార్తికుడు

దావీదు: "చచ్చిన కుక్కను గదా! మిన్నల్లిని గదా!"(1సమూ 24:14)

నూతన నిబంధన ప్రకారము యేసు క్రీస్తు వంశావళికి మూల పురుషుడు; దేవుని హృదయానుసారుడు; గొప్ప సంగీత విద్వాంసుడు; దేవుని పక్షముగా యుద్ధాలు చేయడానికి ప్రత్యేకపరచబడినవాడు; ఇశ్రాయేలీయుల సమిష్టి రాజ్యానికి రెండవ రాజుప్రియులారా! ఇంతటి గొప్ప వ్యక్తులు ఇంతగా తగ్గించుకుంటే, కాదు అంతగా తగ్గించుకున్నారు కాబట్టే అంతటి గొప్పవారయ్యారు. మరి మన జీవితాలెట్లా వున్నాయి. నిన్ను నీవు హెచ్చించుకోవడానికి గాని, నిన్ను బట్టి నీవు అతిశయించడానికి గాని, నీకంటూ ఈ లోకంలో ఏమి లేదు. ఏదైనా వుందంటే. అది ప్రభువు నీకిచ్చినదే. నిన్ను నీవు తగ్గించుకొని, ప్రభువును హెచ్చించు! అది నీ జీవితానికి ధన్యకరము! ఆ రీతిగా మన జీవితాలను సిద్ధపరచుకొందము. అట్టి కృప, ధన్యత ప్రభువు మనకు అనుగ్రహించును గాక! ఆమెన్!

# వాహనాలను ఆకస్మిక తనిఖీ చేపట్టిన రవాణాశాఖ అధికారులు

## పలు వాహనాలకు జరిమానా విధింపు




తాళ్లపూడి, జూన్ 26, (సువార్త ప్రతినిధి): తాళ్లపూడి మండలంలో శుక్రవారం కొవ్వూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె.వి శివప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న ఆటోలు, ఇతర ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగాశివప్రసాద్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కాగితాలు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పర్మిట్ వంటి కీలక పత్రాలు లేని వాహనాలకు అక్కడికక్కడే జరిమానాలు విధించడం జరిగిందని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఒక్కో వాహనానికి రూ. 5,000 నుంచి రూ. 15,000 వరకు జరిమానా విధించామని, జరిమానా విధించిన ఆటోలను తాళ్లపూడి పోలీస్ స్టేషన్ కు తరలించామని జరిమానా చెల్లించి ఆటోలను విడిపించుకోవాలని అంతేకాకుండా పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించి, సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తే ప్రత్యేకంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రయాణికుల భద్రతే మాకు ముఖ్యమని లైసెన్స్, ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్డెక్కితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి డ్రైవర్ తమ వద్ద అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉంచుకోవాలని ఇకపై ప్రతిరోజూ తనిఖీలు కొనసాగుతాయనీ, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవు అని ఆయన హెచ్చరించారు. వాహనదారులంతా వెంటనే తమ పత్రాలను రెన్యువల్ చేసుకోవాలని పెండింగ్ లో ఏమైనా పత్రాలు ఆర్టీవో కార్యాలయం సంప్రదించి పూర్తి చేసుకోవాలని సూచించారు

# సముద్రం దాటి..

# సింగపూర్‌కు ఆంధ్రా బంగినపల్లి మామిడి



తొలిసారిగా సముద్ర మార్గంలో సింగపూర్‌కు బంగినపల్లి మామిడి ఎగుమతి

ఏపీ రైతుల నుంచి సేకరించిన 5 మెట్రిక్ టన్నుల మామిడి పండ్లు

ఈ ఎగుమతుల ద్వారా రైతులకు దాదాపు రెట్టింపు ఆదాయం

మామిడి నాణ్యత, రుచిపై సింగపూర్ దిగుమతిదారుల ప్రశంసలు

తక్కువ ఖర్చుతో వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

జూన్ 26(సువార్త ప్రతినిధి):భారత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి రంగంలో ఒక కీలక మైలురాయి నమోదైంది. అత్యంత ప్రసిద్ధి చెందిన బంగినపల్లి మామిడి పండ్లను తొలిసారిగా వాణిజ్యపరంగా సముద్ర మార్గం ద్వారా సింగపూర్‌కు విజయవంతంగా ఎగుమతి చేశారు. ఈ చారిత్రాత్మక ముందడుగు ద్వారా తక్కువ ఖర్చుతో, పర్యావరణ హితంగా తాజా పండ్లను అంతర్జాతీయ మార్కెట్లకు చేరవేసేందుకు కొత్త మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఎగుమతి ప్రక్రియను వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) పర్యవేక్షించింది. ఇందులో భాగంగా, ఓసమ్ ఫుడ్ సొల్యూషన్స్ సంస్థ 5 మెట్రిక్ టన్నుల బంగినపల్లి మామిడి పండ్లను జూన్ 11న ఎగుమతి చేయగా, ఈ కన్సైన్‌మెంట్ జూన్ 24న సింగపూర్ తీరానికి చేరుకుంది. ఈ మొత్తం ప్రక్రియ విజయవంతం కావడంలో లక్నోలోని ఐకార్–సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ (సీఐఎస్‌హెచ్) కీలక పాత్ర పోషించింది. రైతులకు రెట్టింపు లాభం ఈ ఎగుమతి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్' (జీఏపీ) ధ్రువీకరణ పొందిన తోటల నుంచి మామిడి పండ్లను సేకరించారు. అనంతరం కర్ణాటకలోని అపెడా గుర్తింపు పొందిన ప్యాక్‌హౌస్‌లో వీటిని శుద్ధి చేసి ప్యాకింగ్ చేశారు. ఈ ఎగుమతి రైతులకు ఆర్థికంగా భారీ ప్రయోజనాన్ని చేకూర్చింది. స్థానిక మార్కెట్‌లో కిలో మామిడి ధర రూ. 25 నుంచి రూ. 26 ఉండగా, ఎగుమతి ద్వారా రైతులకు కిలోకు సుమారు రూ. 50 లభించింది. దీంతో రైతుల ఆదాయం దాదాపు రెట్టింపు అయింది. సింగపూర్‌లో ఈ పండ్లను దిగుమతి చేసుకున్న ఈసీ–లింక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, మామిడి నాణ్యత అద్భుతంగా ఉందని ప్రశంసించింది. పండ్ల తీపిదనం, ఒకేరీతిలో పక్వానికి రావడం, ఎక్కువ కాలం నిల్వ ఉండటం వంటి లక్షణాలను ప్రత్యేకంగా అభినందించింది. సింగపూర్ నిర్దేశించిన నాణ్యత, ఫైటోశానిటరీ నిబంధనలను ఈ కన్సైన్‌మెంట్ విజయవంతంగా అందుకుంది. శాస్త్రీయ పద్ధతుల్లో కోత అనంతర యాజమాన్యం, సముద్ర రవాణాలో కోల్డ్–చైన్ లాజిస్టిక్స్ సమర్థతను ఇది నిరూపించింది. ఎగుమతులకు కొత్త ఊపు

బంగినపల్లి మామిడి తన బంగారు పసుపు రంగు, చక్కటి సువాసన, పీచులేని గుజ్జు, అద్భుతమైన తీపిదనంతో అంతర్జాతీయంగా మంచి పేరు పొందింది. ఈ విజయవంతమైన ఎగుమతి, తాజా పండ్ల రవాణాకు వాయు మార్గంతో పోలిస్తే సముద్ర మార్గం ఎంతో చౌకైనది, పర్యావరణ హితమైనది, వాణిజ్యపరంగా లాభదాయకమైనదని రుజువు చేసింది. శక్తిమంతమైన కోల్డ్–చైన్ మౌలిక సదుపాయాలు, శాస్త్రీయ నిర్వహణ పద్ధతుల మద్దతుతో సముద్ర రవాణా భారత ఉద్యానవన ఎగుమతుల పోటీతత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వ్యవసాయ ఎగుమతులను పెంచడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, భారత వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడం అనే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అపెడా ఈ చొరవ తీసుకుంది.

# లారీలో చెలరేగిన మంటలు..

## డ్రైవర్ సజీవదహనం



అనంతపురం,(సువార్త ప్రతినిధి): ఉరవకొండ మండలం బూదగవి సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడి.. రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. అనంతరం లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ ఓబుల్‌రెడ్డి సజీవ దహనం అయ్యారు. క్లీనర్ పుల్లయ్య ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న విడపనకల్లు పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. లారీలో చెలరేగిన మంటలను అదుపు చేశారు.ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆ ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు కడప జిల్లా పులివెందుల సమీపంలోని కనుమపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ప్రమాదంపై లారీ డ్రైవర్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

# రక్షణగిరిపై కరుణామయుడు



(సువార్త ప్రతినిధి): విశాఖపట్నం రైల్వేస్టేషన్ సమీపాన రక్షణగిరిపై 32 అడుగుల ఎత్తయిన ఏసుక్రీస్తు విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ కొండపై ఏటా క్రిస్మస్ రోజున పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇక్కడ వందేళ్ల పైబడిన సెయింట్ పీటర్స్ చర్చి ఉంది. ఈ కొండపై నుంచి చూస్తే విశాఖలో అనేక ప్రాంతాలు కనిపిస్తాయి. ఆ కరుణామయుడు ఈ నగరాన్ని చల్లగా చూడాలని కోరుతూ ఆయన విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్టు స్థానిక మాజీ కార్పొరేటర్ తెలిపారు. దీని నిర్మాణం పూర్తికావడానికి మరో రెండు నెలలు పడుతుందని, ఆ తర్వాత ఈ విగ్రహాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

# పల్నాడు జిల్లా మాచర్ల వద్ద ఘోర ప్రమాదం..

## కారు, లారీ ఢీకొని నలుగురి మృతి..




పల్నాడు జిల్లా:(సువార్త ప్రతినిధి): మాచర్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నగరవనం వద్ద లారీ, తుఫాను వాహనం ఢీకొని నలుగురు మృతిచెందగా.. పలువురికి తీవ్రగాయాలు అయ్యాయి. వేగంగా వెళ్తున్న కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో సంఘటనా స్థలంలోనే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, ఇతర వాహనదారుల వెంటనే 108, పోలీసులకు సమాచారం అందించారు.హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను వెంటనే మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బాధితులను హైదరాబాద్ వాసులుగా పల్నాడు జిల్లా పోలీసులు గుర్తించారు. వెంటనే వారి కుటుంబాలకు సమాచారం అందించారు. కాగా, బాధితులు హైదరాబాద్ నుంచి పామురు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# యూనిఫాం వదిలేస్తా!



(సువార్త ప్రతినిధి): విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్ మాజీ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్‌వీవీ నాగరాజు యూనిఫాం తీసేద్దామని నిర్ణయించుకున్నారా? పోలీసు ఉద్యోగంలో రోజురోజుకూ ఒత్తిడి పెరుగుతోందని భావించారా? అంటే.. పోలీసు వర్గాలు అవుననే అంటున్నాయి. నాగరాజు ఎన్నికలకు ముందు పోలీసు కమిషనరేట్‌కు వచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కమిషనరేట్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లను మార్చారు. ఇందులో భాగంగా నాగరాజును కృష్ణలంక ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. పోలీసు కమిషనరేట్‌లో నాగరాజుకు కొంతమంది ఇన్‌స్పెక్టర్లు సన్నిహితంగా ఉండేవారు. కోనసీమ జిల్లాలో ఆయనతో పాటు చదువుకున్న కొంతమంది స్నేహితులు వివిధ రంగాల్లో విజయవాడలో స్థిరపడ్డారు. వారందరినీ నాగరాజు అప్పుడప్పుడు కలుస్తుండేవారు. యోగక్షేమాల గురించి మాట్లాడుకునే సందర్భంలో ఉద్యోగానికి రాజీనామా చేసే యోచనలో ఉన్నానని నాగరాజు వ్యాఖ్యానించినట్టు సన్నిహితులు చెబుతున్నారు. రౌడీషీటర్ గాదె సాయికృష్ణ ఘటనకు ముందే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

# పెరిగిన కూరగాయల ధరలు



ధర్మవరం(అనంతపురం)(సువార్త ప్రతినిధి): కూరగాయల ధరలు పైపైకి పెరిగిపోతున్నాయి. రెండు వారాల వ్యవధిలో ధరల్లో భారీ పెరుగుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వేసవి ముందు వేసి కూరగాయల పంటలు దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. స్థానికంగా పండిన పంట సరిపోక ఇతర ప్రాంతాలు నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్లలో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. కొత్తపంట మార్కెట్‌కు వచ్చే వరకూ ఇదేపరిస్థితి కొనసాగుతుందని వ్యాపారులు చెబుతున్నారు.పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో అన్ని రకాల నిత్యావసర సరుకులు, వంట నూనెల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కూరగాయల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. సాధారణంగా వేసవిలో ధరలు అధికంగా ఉండి వర్షాకాలం ప్రారంభ సమయానికి తగ్గడం ప్రారంభిస్తాయి. ఈసారి అందుకు భిన్నంగా రెండు వారాల వ్యవధిలో భారీగా పెరిగాయి. జిల్లాలో ధర్మవరం, బుక్కపట్నం, పుట్టపర్తి, ముదిగుబ్బ, బత్తలపల్లి, ఎన్‌పీకుంట, తలుపుల, తాడిమర్రి, ఓడీసీ, గోరంట్ల మండలాల్లో కూరగాయల పంటలు సాగవుతున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరతో కొనుగోలు చేసి మార్కెట్‌లో రెట్టింపు చేసి విక్రయాలు చేస్తున్నారు.

రెండు వారాల్లోనే..

రెండు వారాల వ్యవధిలోనే కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. రెండు వారాల క్రితం వరకూ కిలో క్యారెట్ రూ.60 ఉండగా, ప్రస్తుత రూ.80కి పెరిగింది. వంకాయలు రూ.40నుంచి రూ.60కి, మునక్కాయలు రూ.60 నుంచి రూ.90, బీరకాయలు రూ.40 నుంచి రూ.50, పచ్చిమిరప రూ.40 నుంచి రూ.80, కాకర రూ.40 నుంచి రూ.60, బీరకాయలు రూ.60 నుంచి రూ.63, బీట్‌రూట్ రూ.40 నుంచి రూ.60కి పెరిగాయి. టమోట రూ.50 నుంచి రూ.40, బెండకాయలు రూ.50 నుంచి రూ.40కి స్వల్పంగా తగ్గాయి.

జ్ఞుఖఅఎబ1.2.యజ్ఞూస్త్రధరల రెట్టింపుతో భారం

ఇటీవల కూరగాయల ధరలు గణనీయంగా పెరగడంతో తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాం. అసలే నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో సతమతమవుతున్నాం. దీనికితోడు కూరగాయల ధరలు కూడా రెట్టింపు అయ్యాయి. ఇలా అయితే నచ్చిన విధంగా వంటలు చేసుకోలేం. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ధరలను నియంత్రించాలి ప్రస్తుతం కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. గతంలో రూ.300 తీసుకుని మార్కెట్‌కు వెళ్లితే బ్యాగు నిండా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం నాలుగైదురకాల కూరగాయలు కూడా రావడంలేదు. పైగా రూ.600 వరకు ఖర్చు అవుతోంది. దీంతో రోజు ఏమి కూరలు చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ధరలు తగ్గేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

# నంద్యాలలో ఫకీరు వేషంలో దొంగతనం..



నంద్యాల జిల్లా, (సువార్త ప్రతినిధి): నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలంలోని సౌరదిన్నె గ్రామంలో ఫకీరు వేషంలో వచ్చిన ఓ దుండగుడు మహిళను మోసం చేసి రూ.50 వేల నగదును అపహరించాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పూజల పేరుతో నమ్మకం కల్పించి దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సౌరదిన్నె గ్రామానికి చెందిన కాశింభీ అనే మహిళ ఇంటికి ఫకీరు వేషంలో ఓ వ్యక్తి వచ్చాడు. ఆమె కుటుంబం కొన్ని సమస్యలు, బాధల్లో ఉందని చెప్పి పూజలు చేస్తే అన్నీ సవ్యంగా జరుగుతాయని నమ్మించాడు. తన మాటలతో మహిళను నమ్మించిన దుండగుడు ప్రత్యేక పూజలు చేయాలని తెలిపాడు. పూజలకు అవసరమైన సామగ్రి తీసుకురావాలని చెప్పడంతో కాశింభీ సమీపంలోని అంగడికి వెళ్లింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న ఫకీరు ఇంట్లోకి ప్రవేశించి నగదు కోసం వెతికాడు.ఇంట్లో భద్రపరిచిన రూ.50 వేల నగదును అపహరించి అక్కడి నుంచి పరారయ్యాడు. కొంతసేపటి తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన కాశింభీ నగదు కనిపించకపోవడంతో షాక్‌కు గురైంది. ఫకీరు కూడా అక్కడ లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అనంతరం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.గ్రామ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఫకీరు వేషంలో తిరుగుతూ ప్రజలను మోసం చేసే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ ఘటనతో సౌరదిన్నె గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపరిచితుల మాటలను నమ్మి ఇంట్లోకి అనుమతించవద్దని, నగదు, విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని పోలీసులు సూచించారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం!



విజయవాడ, (సువార్త ప్రతినిధి): దేశవ్యాప్తంగా శుక్రవారం నుంచి జూలై 2 వరకు జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల్లో అవగాహన పెంచడం, ప్రమాదాలను నివారించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల వల్ల ఏటా ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతోందని, అవగాహనలేమి కారణంగా పరిశ్రమలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని '100 శాతం విద్యుత్ భద్రత-సున్నా ప్రమాదాలు' లక్ష్యంతో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ భద్రతా సంచాలకుల శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, ఆస్పత్రులు, పరిశ్రమలు, సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్, ఈవీ చార్జింగ్ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భవనాల నిర్మాణం, విద్యుత్ వినియోగంలో కేంద్ర విద్యుత్ అథారిటీ (సీఈఏ) నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

ఇవి కచ్చితంగా చేయాలి..

అత్యవసర పరిస్థితుల్లో ఎత్తైన భవనాల్లో విద్యుత్ సరఫరా నిలిపేసే ఐసోలేటింగ్ పరికరాలు ఏర్పాటు చేయడం, ప్రతి అంతస్తులో ఫైర్ బారియర్లు ఏర్పాటు చేయడం అవసరమని విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆస్పత్రులు, విమానాశ్రయాలు, హోటళ్లలో తక్కువ పొగ వెలువరించే ఫ్లేమ్ రిటార్డెంట్ కేబుల్స్ వినియోగం తప్పనిసరి అని తెలిపారు. ప్రతి భవనంలో లైట్నింగ్ రక్షణ వ్యవస్థ, సరైన ఎర్తింగ్ ఉండాలని సూచించారు. ఇళ్లలో పాతబడిన వైరింగ్, నాణ్యతలేని పరికరాల వాడకం, సాకెట్లపై అధిక లోడ్ వేయడం, వదులైన కనెక్షన్లు వంటి కారణాల వల్ల షార్ట్‌సర్క్యూట్లు సంభవిస్తున్నాయని తెలిపారు. తేమ, సరైన ఫ్యూజ్‌లు లేదా బ్రేకర్లు లేకపోవడం, ఆర్‌సీసీబీ వంటి రక్షణ పరికరాలు ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలను పెంచుతాయని వివరించారు. ఏసీలు, మోటార్లలో లోపాలు అగ్ని ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు.

# విద్యార్థులు లేకపోతే 'మిగులు'గా టీచర్లు



అమరావతి, (సువార్త ప్రతినిధి): ఏదైనా పాఠశాలలో అసలు విద్యార్థులు లేకపోతే.. అక్కడ పనిచేసే టీచర్లను మిగులుగా చూపించి సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఒక పాఠశాలలో ఎస్జీటీ, ఎంటీఎస్ టీచర్ పనిచేస్తుంటే... వారిలో ఒకరిని మిగులుగా చూపాల్సి వస్తే ఎంటీఎస్ టీచర్ మిగులు అవుతారని వివరించింది. ప్రాథమికోన్నత పాఠశాలలో ఇంగ్లిష్, గణితం ఇద్దరు టీచర్లు పనిచేస్తుండగా.. ఒకరు మిగులుగా మారాల్సి వస్తే గణితం టీచర్‌ను మిగులుగా చూపించాలని స్పష్టం చేసింది. డిప్యుటేషన్లపై పనిచేస్తున్న టీచర్ల స్థానాలను సర్దుబాటు చేయాలని తెలిపింది. గతేడాది 40 మంది విద్యార్థులున్న బేసిక్ ప్రైమరీ పాఠశాలలో ఇప్పుడు 60 మంది విద్యార్థులుంటే దానిని మోడల్ ప్రై మరీ స్కూల్‌గా మార్చి ఐదుగురు ఎస్జీటీలను కేటాయించాలని స్పష్టం చేసింది.

# చకచకా రైల్వే జోన్ భవన నిర్మాణం



విశాఖపట్నం,(సువార్త ప్రతినిధి):ముడసర్లోవలో దక్షిణ కోస్తా జోన్ రైల్వే ప్రధాన కార్యాలయం నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా ఈ ఆరు నెలల్లో స్థలాన్ని చదును చేసి, అప్రోచ్ రహదారి వేసి, ప్రహరీ నిర్మాణం చేపట్టారు. అలాగే రెండు బేస్‌మెంట్లు, ఆ పైన గ్రౌండ్ ఫ్లోర్ పూర్తయ్యాయి. ఇప్పుడు మొదటి అంతస్థు పనులు జరుగుతున్నాయి. ఈ భవన నిర్మాణానికి తొలుత రూ.107 కోట్లు కేటాయించగా, ఆ తరువాత అంచనా వ్యయం రూ.121.58 కోట్లకు పెరిగింది. జూన్ 25వ తేదీ నాటికి అందులో రూ.42.14 కోట్లు వివిధ పనులకు వెచ్చించినట్టు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి.

కొత్త తరహాలో నిర్మాణం

దేశంలో రైల్వే జోన్ భవనాలన్నీ సమాంతరంగా నిర్మించగా విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయాన్ని మాత్రం నిట్టనిలువు (వర్టికల్)గా నిర్మిస్తున్నారు. పర్యావరణ హిత నిర్మాణానికి అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్నారు. పగటిపూట విద్యుద్దీపాలు ఉపయోగించాల్సిన అవసరం లేని విధంగా గాలి, వెలుతురు వచ్చేలా ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం నిర్మిస్తున్నారు. సోలార్ విద్యుత్, వర్షపు నీటిని సంరక్షించడం, వ్యర్థ జలాల వినియోగం, ఇంధనం పొదుపు చేసే ఎయిర్ కండిషనింగ్, నీటిని పొదుపు చేసే ప్లంబింగ్ పరికరాలు దీనికి అమర్చనున్నారు. వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా, పార్కింగ్ ఇబ్బందులు లేని విధంగా, సందర్శకులకు ఆహ్లాదం కలిగేలా భవన పరిసరాలను తీర్చిదిద్దనున్నారు. భారతీయ రైల్వేలో నూతన పరిపాలనా భవన నమూనాలకు తలమానికంగా ఉండేలా దీనిని నిర్మిస్తున్నట్టు రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. భవనానికి అప్రోచ్ రహదారి 60 శాతం పూర్తయింది.

# ఉద్యోగుల సర్వీసు విషయాల్లో పిల్ దాఖలుకు వీల్లేదు'




అమరావతి,(సువార్త ప్రతినిధి): హైకోర్టు, డిస్ట్రిక్ట్ జ్యుడీషియరీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు 180 రోజుల శిశు సంరక్షణ సెలవులు, 5 రోజులు అదనపు సాధారణ సెలవులు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. ఉద్యోగుల సర్వీసు సంబంధ విషయాల్లో పిల్ దాఖలు చేయడానికి వీల్లేదని, ఈ విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చిందని గుర్తు చేసింది. పిల్‌కు విచారణార్హత లేదంటూ కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులతో సమానంగా హైకోర్టు, డిస్ట్రిక్ట్ జ్యుడీషియరీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు సెలవులు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆర్చ్ బిషప్ చేగుడి అశోక్‌బాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్ గురువారం విచారణకు వచ్చింది.

# సబ్సిడీ రుణాలకు ఎదురుచూపులు



(విశాఖపట్నం–(సువార్త ప్రతినిధి): నిరుపేదలకు బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు ప్రక్రియ ముందుకుసాగడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన సం క్షేమ శాఖలను గాడిలో పెట్టాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. అందులో భాగంగా గడిచిన ఏడాది సంక్షేమ శాఖల ద్వారా సబ్సిడీతో కూడిన స్వయం ఉపాధి రుణాలు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైనవారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సుమారు ఆరేళ్ల తరువాత రుణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధం కావడంతో వేలాది దరఖాస్తులు వచ్చాయి. అర్హులైన వారిని ఎంపిక చేసి రుణాలు/యూనిట్లు మంజూరుచేస్తారని అంతా భావించారు. అయితే, అనూహ్యంగా గడిచిన ఏడాది జూన్ నుంచి ఈ ప్రక్రియ మొత్తం నిలిచిపోయింది.

అదనపు యూనిట్లు మంజూరు చేయాలని..

సుమారు ఆరేళ్ల తరువాత బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల నుంచి సబ్సిడీతో కూడిన రుణాలు/ యూనిట్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం కావడంతో స్థానిక ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి పెరిగింది. తమ పేరు సిఫారసు చేయాలని దరఖాస్తుదారులంతా ఎమ్మెల్యేల చుట్టూ తిరగడం ప్రారంభించారు. జిల్లాలకు కేటాయించిన యూనిట్లు తక్కువగా ఉండడం, దరఖాస్తులు భారీగా రావడంతో ప్రజా ప్రతినిధులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని అనేకమంది ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, యూనిట్లు పెంచాలని కోరారు. దీంతో ప్రభుత్వం జిల్లాల వారీగా యూనిట్లను పెంచుతామని, అప్పటివరకూ రుణాల మంజూరు ప్రక్రియను పెండింగ్‌లో పెట్టాలని సూచించింది. అయితే, ఏడాది కావస్తున్నా కదలిక లేకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన ఏడాది కొందరికైనా యూనిట్లు మంజూరుచేసి ఉంటే, ఈ ఏడాది మరికొంత మందికి అవకాశం ఉండేదని, మొత్తం ప్రక్రియ ఆపేయడం వల్ల ఎవరికీ ప్రయోజనం లేకుండా పోయిందని అంటున్నారు.

భారీగా దరఖాస్తులు

జిల్లాలోని బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని బీసీ, ఈబీసీ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్లకు ప్రభుత్వం 2,436 యూనిట్లను కేటాయించగా 18,984 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా యూనిట్లకు 50 శాతం రుణం, మరో 50 శాతం సబ్సిడీగా అందించ నున్నారు. ఇందుకోసం రూ.58.13 కోట్లు బడ్జెట్‌ను కేటాయించింది. అలాగే, ఎస్సీ కార్పొరేషన్‌కు 406 యూనిట్లను మంజూరు చేయగా, 8,945 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 32 కేటగిరీల్లో యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం రూ.16.88 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.6.68 కోట్లు సబ్సిడీ కాగా, బ్యాంకు రుణం రూ.9.35 కోట్లు, లబ్ధిదారులు వాటా రూ.0.84 కోట్లు. రుణాలు మంజూరులో జాప్యంపై బీసీ సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శంకర రావును వివరణ కోరగా యూనిట్లు పెంచే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రక్రియను నిలిపినట్టు తెలిపారు. మరిన్ని అదనపు యూనిట్లు మంజూరయ్యే అవకాశం ఉందని, కొద్ది రోజులు కిందట రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు సమా వేశాన్ని కూడా నిర్వహించారన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి కృషి: ఆఫ్కాఫ్ చైర్మన్



అమరావతి, (సువార్త ప్రతినిధి): ఏపీలో మత్స్యకారుల సంక్షేమానికి వివిధ పథకాల అమలుపై జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు అధికారులతో రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్కాఫ్) చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ చర్చించారు. ఎన్‌ఎ?ఫడీబీ సీఈవో బహేరా, ఇతర అధికారులతో ఆఫ్కాఫ్ చైర్మన్, డైరెక్టర్లు సమావేశమయ్యారు. రాష్ట్రంలో మత్స్యకారులకు గ్రాంట్ల రూపంలో వచ్చే నిధుల గురించి చైర్మన్ రాంప్రసాద్ ఆరా తీశారు. ఆక్వాకు సంబంధించి ప్రత్యేక పథకాలు, బీమా, డీప్ సీ బోట్లు గురించి వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలను ఉపయోగించి, రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమానికి మరింత కృషి చేస్తామని ఆయన చెప్పారు. అమరావతిలో ఎన్‌ఎ?ఫడీబీ కార్యాలయ నిర్మాణానికి రెండెకరాలు ఇవ్వడానికి సీఎం అంగీకరించిన విషయాన్ని ఆయన సీఈవో దృష్టికి తీసుకెళ్లారు.

# ఘనంగా ప్రారంభమైన రొట్టెల పండుగ.. బారాషహీద్ దర్గాకు పోటెత్తిన భక్తజనం..



నెల్లూరు: (సువార్త ప్రతినిధి): నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద ప్రతిష్ఠాత్మక రొట్టెల పండుగ ఈరోజు (శుక్రవారం) అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తొలి రోజు భక్తిశ్రద్ధల నడుమ సంధల్ మాల్ కార్యక్రమంతో వేడుక మొదలైంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు జరిగే రొట్టెల పండుగకు భారీగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. దర్గా పరిసరాలు, ప్రధాన రహదారులు, స్వర్ణాల చెరువు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు 900 మంది కార్మికులను అధికారులు ప్రత్యేకంగా నియమించారు. మరోవైపు భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు జిల్లా పోలీసులు. మొత్తం 1,743 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. 26 డ్రోన్లు, 96 సీసీ కెమెరాల ద్వారా దర్గా పరిసర ప్రాంతాలపై నిరంతర నిఘా పెట్టారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అజితా వెజెండ్ల హెచ్చరించారు. భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ ఆర్టీసీ 69 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. మహిళలకు స్త్రీశక్తి, దివ్యాంగులకు దివ్యాంగ శక్తి పథకాల సౌకర్యాలను ఈ ప్రత్యేక సర్వీసుల్లో అమలు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సీఎం చంద్రబాబు సర్కార్ ఆదేశాల మేరకు పండుగ ముగిసే వరకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాయి.

# చెత్త తరలింపులో మహా మాయ



